క్లుప్తంగా

పరీక్ష కేంద్రం తనిఖీ

శ్రీరంగరాజపురం: పదవ తరగతి పరీక్షలు పకడ్బందీ నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు అన్నారు. బుధవారం కొత్తపల్లిమిట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్‌కు తావివ్వకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం హిందీ పరీక్షకు 379 మందికిగాను 378 మంది హాజరయ్యారని పరీక్షల కేంద్రం చీఫ్ ఆయనకు తెలియజేశారు.

ఓటు హక్కుపై ర్యాలీ



డ్వాక్రా సభ్యుల మానవహారం

గంగాధర నెల్లూరు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం చిరంజీవి అన్నారు. ఓటు హక్కు వినియోగంపై మండలంలోని తూగుండ్రంలో బుధవారం డ్వాక్రా మహిళా సంఘ సభ్యులతో ఆయన అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని, మంచి నాయకత్వం కోసం ఓటు వేయడం అందరి బాధ్యత అన్నారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీసీలు, సంఘమిత్రలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది



నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్ రెడ్డి భరోసా ఇచ్చారు. వడమాలపేట మండలం బుట్టిరెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్యామ్‌శివారెడ్డి తల్లి నారాయణమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి నారాయణమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'ఫుడ్ ఫెస్టివల్'



ఫుడ్ ఫెస్టివల్‌లో వంటకాలను రుచి చూస్తున్న ఎంఈఓలు

కార్వేటినగరం: స్థానిక శ్రీలక్ష్మీ నరసింహ ప్రైవేటు హైస్కూల్లో బుధవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్ దీనిని ప్రారంభించి మాట్లాడారు. క్రిమిసంహార మందులు, రసాయన ఎరువులతో పండించినవి కాకుండా ప్రకృతి వ్యవసాయోత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యకరం అన్న అంశంతో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. కరస్పాండెంట్ దిలీప్‌కుమార్, డైరెక్టర్లు ధనంజయరెడ్డి, వెంకటేష్, పురుషోత్తం, హెచ్‌ఎం మహేశ్వర్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గజ వాహనంపై పరమేశ్వరుడి విహారం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పంగుణి బ్రహ్మోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం, రాత్రి విశేష పూజలు, అభి షేకాలు విశేషంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా గాండ్ల కులస్తుల ఆధ్వర్యంలో గజవాహన సేవను అంగరంగవైభవంగా నిర్వహించారు.

ఫిజియోథెరపీ



పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న అనూష

పాలసముద్రం: మండలంలోని అంగవైకల్యం కలిగిన పిల్లల చేత క్రమం తప్పకుండా తేలికపాటి వ్యాయామాలు చేస్తే వారిలో వైకల్య శాతం తగ్గుతుందని ఎంఈఓ గిరిజ అన్నారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో ఫిజియో థెరపిస్ట్ అనూష ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. తొమ్మిది మంది పిల్లలకు వ్యాయామాలు చేయించారు. అనంతరం ఎంఈఓతో పాటు అనూష మాట్లాడారు. కూర్చోవడానికి, నిలబడేందుకు, నడిచేందుకు ఇబ్బందులు పడుతున్న పిల్లలకు భవిత కేంద్రంలో ఉచితంగా ఫిజియోథెరపీ చేస్తామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో కార్పొరేట్ వైద్యం



విజయపురం పీహెచ్‌సీ



అత్యాధునిక ల్యాబ్

- అందుబాటులో అత్యాధునిక పరికరాలు
- ఆరోగ్య కేంద్రంలోనే 63 రకాల వైద్య పరీక్షలు
- వైద్య రంగానికి ప్రాధాన్యతనిచ్చిన ప్రభుత్వం





విజయపురం పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న 104, 108 వాహనం

విజయపురం: మండలంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)లు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాయి. ఒకప్పుడు మెరుగైన వైద్యం కోసం నగరి, పుత్తూరు పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మండల స్థాయి పీహెచ్‌సీలో పెద్దాస్పత్రి సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైద్య రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేక నిధులు కేటాయించింది. ఫలితంగా ఆరోగ్య కేంద్రాల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. ప్రజాప్రయోజనాల కోసం పీహెచ్‌సీలో తగినంత సిబ్బందిని నియమించిన సర్కారు, వారికి శిక్షణ ఇచ్చి అత్యంత పారదర్శకంగా సేవలందిస్తోంది. పీహెచ్‌సీలో అధునాతన యంత్ర సామగ్రిని వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కో పీహెచ్‌సీకి యూరిన్ ఎనలైజర్, టీలీ, పీసీఆర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, సీబీసీ తదితర పరికరాలు ప్రభుత్వం అందజేసింది. గతంలో 15 రకాల వైద్య సేవలు మాత్రమే అందుబాటులో ఉండేవి. నేడు 63 రకాల వైద్యపరీక్షలు చేసే అవకాశం కల్పించారు. ప్రతి పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలందిస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ని ప్రత్యేకంగా నియమించారు.

వైద్య పరీక్షలు

హెచ్‌బి, ప్లేట్లెట్ కౌంట్, బ్లడ్ గ్రూపు, హెచ్ఐవీ, హెచ్‌సీఎస్‌జీ, వీడీఆర్ఎల్, గల్ల పరీక్ష, ర్యాండం బ్లడ్ సుగర్, యూరియా క్రియాటిన్, మలేరియా, డెంగీ, వైడల్, ఎస్‌ఓటీ, ఎస్ జీపీటీ, ఏఎల్పీ, లిపిడ్ ప్రొఫైల్, సోడియం, పోటాషియం, క్లోరైడ్, యూరిన్ మైక్రో స్కోపిక్ వంటి 63 రకాల పరీక్షలు చేయనున్నారు.

గతం కన్నా నేడు ఎంతో నయం



గతంలో చిన్న జ్వరం వచ్చినా పట్టణానికి వెళ్లాల్సిన దుస్థితి వుండేది. సుమారు 25 కిలోమీటర్ల దూరం వెళ్లి వైద్యం చేసుకునేవాళ్లం. ఇప్పుడు మా విజయపురం ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాధులకు వైద్యం చేస్తున్నారు. అంతే కాకుండా ప్రతి నెలా 104 వాహనం మా గ్రామానికి వస్తుంది. అవసరమైనప్పుడు డాక్టర్లు ఇంటికే వచ్చి వైద్యం అందిస్తున్నారు.

– రామచంద్రారెడ్డి, మిట్టూరు, విజయపురం

అత్యాధునిక వైద్య పరికరాలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అత్యాధునిక వైద్య పరికరాలు వచ్చాయి. 63 రకాల పరీక్షలు నిర్వహించేందుకు నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. పీహెచ్‌సీలో అన్ని రకాల టెస్టులు చేస్తున్నాం. ప్రైవేటు ల్యాబ్‌లో వేల రూపాయలు ఖర్చు అయ్యే పరీక్షలు సైతం ఇక్కడ ఉచితంగానే చేస్తున్నాం. నేడు పేద రోగులకు ప్రత్యక్ష సేవ చేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

–నాగార్జున, ల్యాబ్ టెక్నీషియన్, విజయపురం

అన్ని రకాలకు వైద్యం చేస్తున్నారు



నాకు షుగర్, బీపీ ఉంది. ఒకప్పుడు వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లేవాన్ని. ఇప్పుడు 104 వాహనం ఊర్లోకి వస్తోంది. దీంతో ఇంటి వద్దే డాక్టర్లు వైద్యం అందించి మందులు ఇస్తున్నారు. పట్టణానికి వెళ్లి వచ్చే అవస్థలు ఇప్పుడు లేవు. అత్యవసరమైనప్పుడు ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, డాక్టర్లు ఇంటికి వచ్చి మా ఆరోగ్యాన్ని పరీక్షించి మందులు ఇవ్వడం ఎప్పుడూ చూడలేదు.

–నార్పరాజు, పాతర్కాడు

63 రకాల వైద్య సేవలు



నూతన పరికరాలు అందుబాటులోకి రావడంతో 63 రకాల వైద్య పరీక్షలు చేసేందుకు అవకాశం వచ్చింది. గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు లేకపోవడంతో రోగులు అవస్థలు పడేవాళ్లు. ఇకపై వైద్య పరీక్షల కోసం పట్టణానికి వెళ్లాల్సిన అవసరం లేదు. రోగులకు ఇక్కడే అన్ని రకాల పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ అయిన తరువాత అవసరమైన వైద్యాన్ని అందిస్తున్నాం.

– సోమశేఖర్, వైద్యాధికారి, విజయపురం

నేనున్నానని.. మంత్రి భరోసా





గుణశేఖర్ రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి ఆర్కే రోజా, వేలాయుధాన్ని పరామర్శిస్తున్న మంత్రి

నగరి: అనారోగ్యం పాలై ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్ రెడ్డి, ఈశ్వర రెడ్డి, ఎంపీటీసీ గుణశేఖర్ రెడ్డి, వేలాయుధంను ఆమె బుధవారం ప్రత్యక్షంగా కలిసి పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. దిగులుపడాల్సిన అవసరం లేదని నేనున్నాంటూ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శనం నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, నాయకులు దినకర్‌రెడ్డి, పరంధామరెడ్డి, శరత్ బాబు, హరిరెడ్డి, రంగనాథం, రామ్మూర్తిరెడ్డి, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై కరకంఠేశ్వరుడు



శేష వాహనంపై కరకంఠేశ్వరుడు

నగరి: పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కరకంఠేశ్వర స్వామిని శేష వాహనంపై ఊరేగించారు. ఆలయంలో అభిషేక అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో ఊరేగింపుగా వచ్చిన స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంక్షేమ సేవా సంఘం వారు ఈ సేవకు ఉభయదారులుగా వ్యవహరించారు.

శరవేగంగా ఆలయ నిర్మాణ పనులు



శ్లాబ్ పనులు చేస్తున్న కూలీలు

వెదురుకుప్పం: మండలంలోని సీఆర్‌కండ్రిగ దళితవాడలో వినాయక ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా చేస్తున్నారు. గ్రామస్తుల వినతిపై స్పందించి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి రూ. 10 లక్షలు మంజూరు చేయించారు. దీంతో స్థానిక సర్పంచ్ శిల్ప, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రామయ్య ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. బుధవారం శ్లాబ్ పనులు పూర్తి చేశారు. త్వరితగతిన పనులను పూర్తి చేయనున్నట్లు కాంట్రాక్టర్ రామయ్య పేర్కొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏడుగురు గైర్హాజరు

గంగాధర నెల్లూరు: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మూడవరోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ ఆంజనేయులు శెట్టి తెలిపారు. ఆయన మాట్లాడుతూ, మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ఇంగ్లిష్ పరీక్షకు 617విద్యార్థులకు గాను 610 మంది హాజరయ్యారని ఎంఈఓ చెప్పారు.

సంక్షేమానికి పట్టం కట్టండి



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుత్తూరు: వయసులో చిన్నవాడైనా పెద్ద మనసుతో రాష్ట్రంలోని ప్రతి పేద మహిళ సొంతింటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. స్థానిక గేట్‌పుత్తూరులో బుధవారం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రచారాన్ని రామ్‌ప్రసాద్‌రెడ్డి తొలిసారిగా ప్రారంభించారు. ఆయన ఇంటింటికీ తిరుగుతూ సీఎం జగనన్న నేతృత్వంలో మంత్రి ఆర్కే రోజా అందించిన సంక్షేమ ఫలాలు పుత్తూరులో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నేళ్లు బతికామని కాదు, ఎలా బతికామన్న తన తండ్రి వైఎస్సార్ చూపిన బాటలో తండ్రికి తగ్గ తనయుడిగా జగనన్న పేద ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. ప్రతి మహిళా జీవితానికి సొంతిల్లు ఒకటి కట్టుకుంటే చాలనుకొంటారని, అలాంటిది జగనన్న రాష్ట్రంలో ఇళ్లను కాదు ఊర్లను నిర్మించారని తెలిపారు. రూ.76 వేల కోట్లతో 17,005 జగనన్న లేఅవుట్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 71,811 ఎకరాల విస్తీర్ణంలో 30.75 లక్షల ఇళ్ల పట్టాల పంపిణీ చేసినట్లు వివరించారు. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు స్కాముల పేరిట ప్రజాధనాన్ని దోచేసి, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన జగనన్న రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఏనాడై కుంటిసాకులు చెప్పకుండా ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చారని తెలిపారు. ఇదే చంద్రబాబుకు, జగనన్నకు ఉన్న తేడా అన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి స్కాముల బాబును రాష్ట్రం నుంచి తరిమికొట్టి, సంక్షేమం, అభివృద్ధి అంటూ పరితపిస్తున్న జగనన్నను నిండు మనసుతో ఆదరించాలని కోరారు. మీ ఆడపడచు అయిన మంత్రి రోజమ్మను నగరి ఎమ్మెల్యేగా మూడవసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, సచివాలయ కన్వీనర్ ఏకాంబరం, సదాశివ కోన చైర్మన్ జయచంద్రన్, తిరునావక్కరసు, గోపి, సుందరం, ఏలుమలై, మునిరత్నం, పవన్‌కుమార్, లారీమోహన్, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఇంటివద్దకు వెళ్లి మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

భౌతిక శాస్త్రంతో ఎంతో ఉపయోగం



జాతీయ శిక్షణా శిబిరంలో వక్తలు

నగరి: సమాజానికి భౌతిక శాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుంది అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి ఆచార్య విజయలక్ష్మి అన్నారు. 'పదార్థ విజ్ఞాన శాస్త్రంలో ఇటీవలి ఆవిష్కరణలు, పురోగతులు' అనే అంశంపై నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి బుధవారం ఆమె హాజరయ్యారు. 'పర్యావరణ కాలుష్య క్షీణతకు కాంతి ఉత్ప్రేరక పదార్థాల అభివృద్ధి' అనే అంశంపైన, 'హైడ్రోజన్ ఇంధన ఉత్పత్తి కోసం నానో సంయుక్తాల రూపకల్పన, అభివృద్ధి' అనే అంశంపైన ప్రసంగించారు. వాహకాలు, అర్ధవాహకాలు వాటి ఉపయోగాలు, రకాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన ఏర్పడేలా సుదీర్ఘమైన చర్చ చేశారు. నేటి సమాజంలో భౌతిక శాస్త్ర విజ్ఞానం ఎంతగా ఉపయోగపడుతుందో సవివరంగా తెలియజేశారు. పీటర్స్ ఉన్నత విద్యా పరిశోధక సంస్థ మద్రాసు నుంచి విచ్చేసినటువంటి గుణశేఖరన్ 'పరమాణువులు – అణువర్ణ పట శాస్త్రం' అనే అంశం లోను, ఆచార్య జనని 'అంతర పరావర్తన క్షీణత – పదార్థాల శోధనకు వరం' అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ భౌతిక ఆచార్యులు సి.జయశంకర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధి జగనన్నకే సాధ్యం



పూజల్లో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నాయకులు

వెదురుకుప్పం: ఆలయాల అభివృద్ధి సీఎం జగనన్నకే సాధ్యమైందని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పచ్చికాపల్లంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు.గంగాధరనెల్లూరు నియో జకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, ఆరు మండలాల్లో రూ. 20 కోట్లతో 22 ఆలయాల నిర్మాణానికి పూనుకున్నట్టు చెప్పారు. అలాగే, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 102 గ్రామాల్లో ఒకో ఆలయం రూ.10 లక్షల వ్యయంతో నిర్మించడానికి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. 95 గ్రామాల్లో ధూపదీప నైవేద్యం కింద ఆలయాలకు రూ. 5 వేల చొప్పున నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా హిందూ దేవాలయాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని, సీఎం జగనన్న పాలనలోనే ఆలయాలకు మహర్దశ ప్రాప్తించిందన్నారు. విద్య, వైద్యం పేదలకు అందించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని చూపిందని, 58 నెలల కాలంలో సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది మందికి లబ్ధి చేకూర్చి వారి జీవితాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెలుగులు నింపిందన్నారు. గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలన్నా, పేదలు ఆర్థికంగా మరింత ముందంజ వేయాలన్నా మరోసారి వైఎస్సార్ సీపీని ఎన్నికల్లో గెలిపించాలని, గంగాధరనెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కుంభాభిషేక మహోత్సవంలో డిప్యూటీ సీఎం

మండలంలో పచ్చికాపల్లంలోని సీతాసమేత కోదండరామస్వామి ఆలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన గాలిగోపురం కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఆలయంలో రాముల వారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. కుంభాభిషేక మహోత్సవాలకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి హాజరయ్యారు. రుత్వికులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కోదండరామ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి పూర్ణాహుతి పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు. మంత్రిని రుత్వికులు ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హేమశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ భీమశంకర్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, రోశిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అత్తూరు సురేష్ రెడ్డి, యువత అధ్యక్షుడు నరేష్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు నీలారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

పేదవాడే.. జగనన్న సైనికుడు



మంత్రి ఆర్కేరోజాతో అమర్‌నాథ్

నగరి: పేద ప్రజలకు మంచి చేస్తే ఆ నాయకుడికి వారు అండగా నిలబడతారనడానికి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాడు వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపేట గ్రామానికి చెందిన అమరనాథ్ రెడ్డి. జగనన్న సంక్షేమ శక్తి వదిలిన బాణంలా జనసేన, టీడీపీ కుట్రలను భగ్నం చేయడానికి నేను సైతం అంటూ బైక్ యాత్ర ప్రారంభించారు. తాను ప్రత్యేకంగా డిజైన్ చేసుకున్న బైక్‌పైనే 175 నియోజకవర్గాల్లో ప్రచారం చేయాలన్న మహా సంకల్పంతో యాత్ర కొనసాగిస్తూ బుధవారం నగరి నియోజకవర్గానికి చేరుకున్నాడు. నగరిలో మంత్రి ఆర్కేరోజాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ''అక్కా మీరు నగరిలో హ్యాట్రిక్ విజయం సాధించాలి. ముఖ్యమంత్రిగా జగనన్నే కొనసాగాలి.'' అంటూ తన ఆకాంక్షను స్పష్టం చేశాడు. 175 నియోజకవర్గాల్లోను అభ్యర్థులను, పార్టీ శ్రేణులను కలిసి ప్రచారం చేస్తానని శ్రీరామునికి ఉడతసాయంలా జగనన్నకు నా సాయం ఉపయోగపడితే చాలంటూ మంత్రికి తెలియజేశారు. జగనన్న రూపంలో రాష్ట్రానికి కొత్త వెలుగు వచ్చి ప్రతి పేదవాడి ఇంట ఆనందం కనిపిస్తోందని అది అలాగే కొనసాగాలన్నది ప్రతి పేదవాడి నిర్ణయమన్నారు. జగనన్నకు ప్రతి పేదవాడు సైన్యమేనని వారి తరఫునే యాత్ర చేస్తున్నానన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి అందరికీ మంచి చేసి పేదల పక్షాన నిలిచిన ముఖ్యమంత్రి కావాలా? హామీలన్నీ తుంగలో తొక్కి పేదవానిని వంచించి పెత్తందార్లవైపు నిలిచిని ముఖ్యమంత్రి కావాలా? అంటూ ప్రజలను అడిగి తెలుసుకుంటూ యాత్ర కొనసాగిస్తానన్నారు.

అమర్‌నాథ్‌ను అభినందించిన మంత్రి

జగనన్న ప్రచార సైనికుడు అమర్‌నాథ్‌ను మంత్రి ఆర్కేరోజా అభినందించారు. సామాన్యులంతా జగనన్నవైపే అనడానికి అమర్‌నాథ్ ప్రతీకగా నిలుస్తున్నాడని చెప్పారు. సాయంత్రం నగరికి చేరుకున్న అమర్‌నాథ్‌కు రాత్రి వసతిని మంత్రి కల్పించారు.

అభివృద్ధి చూసి ఓటేయండి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కోరారు. మండలంలోని ముద్దికుప్పం, నెలవాయి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మితో కలసి డిప్యూటీ సీఎం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు పాలన, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఉన్న తేడాను, చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. జగనన్న ఐదేళ్ల పాలనలో నియోజకవర్గం చేసిన అభివృద్ధిని గణాంకాలలో సహా వివరించారు. 250 కోట్లతో రోడ్డు నిర్మాణం, 216 ఓవర్ హెడ్ ట్యాంకులు, 29 కోట్లతో కుశస్థలి నదిపై ఫ్లైఓవర్, 3 ఆలయాలను టీటీడీలో విలీనంతో పాటు కళ్యాణమండపం, ఆలయం లేని 147 గ్రామాల్లో ఆలయాల నిర్మాణం చేస్తున్నట్టు తెలియజేశారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ధ్యేయంగా స్మార్ట్ డీవీ కంపెనీ ఏర్పాటు చేయించామన్నారు. దాదాపు 10,400 వేల మంది నిరుపేదలకు సొంత ఇంటికలను నెరవేర్చడంతోపాటు అర్హులకు భూ పంపిణీ చేశామన్నారు. ఈ సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే కృపాలక్ష్మిని గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచులు గిరిబాబు, జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు సిద్ధయ్య, మాజీ సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మణి, జెడ్పీటీసీ సభ్యులు రమణ ప్రసాద్‌రెడ్డి, నాయకులు శీనయ్య, వాసు, హేమద్రి, కుమార్, రమేష్, పాండు, మునిరత్నంరెడ్డి, చెంగారెడ్డి, అల్లిముత్తు, బాబు, రామ్మూర్తి, విజయ బాబు, కుప్పయ్య, జనార్ధన్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటేసే మాటే లేదు



తెలుగుదేశం పార్టీ వాళ్లకు ఓటేసే మాటే లేదని, సాక్షాత్తు చంద్రబాబే వచ్చి కోటి రూపాయలు ఇచ్చినా సరే తన నిర్ణయం మార్చుకోనని ముద్దుకుప్పం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ తేల్చిచెప్పింది. తనను టీడీపీ వాళ్లు ఎలా ప్రలోభాలకు గురిచేసేందుకు యత్నించారో ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మికి ఆమె చెప్పడం అందరికీ ఆసక్తి కలిగించింది. 'నాకు జగన్ ఎంతో మేలు చేసినాడు.. మూడువేల పింఛనొస్తాంది..బతికున్నంత వరకు తెలుగుదేశమోళ్లకు ఓటేసే మాటే లేదమ్మా!' అని ఖరాకండిగా చెప్పడంతో కృపాలక్ష్మి ఆమెను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



గర్భిణికి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

పాలసముద్రం: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మోహన్‌కృష్ణ కోరారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులు, చిన్నారులు వేస్తున్న టీకాలను, రిజిస్టర్లను పరిశీలించారు. గర్భిణులు ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, సుశీల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.